



ప్రచార ఆర్భాటమేనా?



విజయనగరం: గుంకలాంలో పునాదులతో నిలిచిపోయిన జగనన్న ఇళ్లు

పొదలు, పిచ్చిమొక్కలతో ఇళ్ల స్థలాలు... పునాదులు, గోడలతో నిలిచిన ఇళ్లు.. కానరాని రహదారులు.. సరఫరా కాని తాగునీరు.. కనిపించని విద్యుత్ ఏర్పాట్లు ఇలా మౌలిక సదుపాయాలే సమకూర్చని జగనన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చింది. ఇళ్లపై మూడేళ్లకు పైగా ప్రచారం చేసుకున్న ప్రభుత్వం ఎన్నికల ముందు కూడా అదే పంథాను కొనసాగిస్తోంది. ఈసారి ఇంకాస్త కొత్తదనాన్ని అద్దింది. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియంటోంది. సచివాలయాల్లో ఇటీవల ఈ తంతు ప్రారంభమైంది. అయితే సరిగా సాగడం లేదు. కొత్తగా ఇచ్చేదేముందని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. రిజిస్ట్రేషన్ పేరిట ప్రభుత్వం లబ్ధిదారుల ఓట్లకు గాలం వేస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

- ఇళ్ల రిజిస్ట్రేషన్ తంతుపై విమర్శలు
- ముందుకు సాగని ప్రక్రియ
- తరచూ సాంకేతిక ఇబ్బందులు
- కొన్నిచోట్ల ముందుకు రాని లబ్ధిదారులు
- ఎన్నికల స్టంట్‌గా పేర్కొంటున్న ప్రతిపక్షాలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం తాజాగా తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో అనేక సందేహాలను లేవనెత్తుతున్నాయి. వారంతా ఎన్నికల పుణ్యమేనన్న అభిప్రాయానికి వస్తున్నారు. ప్రధానంగా ఇళ్ల రిజిస్ట్రేషన్ తంతును చేపట్టడం ద్వారా కొద్దిరోజుల పాటు ఉచిత ప్రచారం జరుగుతుందని అనుకుంటున్నారు. ప్రజలకు ఏదో చేస్తున్నట్లు కలరింగ్ ఇచ్చే ఇంకో ప్రయత్నంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఇళ్ల స్థలాలు ఇవ్వడం ద్వారా లబ్ధిదార్లను లక్షాధికారులను చేశామని ప్రచారం చేసుకుంటోంది. అవే ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ల పేరుతో మరో మారు ప్రచారానికి తెరలేపింది. ఈసారి పూర్తి హక్కులు కల్పిస్తున్నామని చెపుతూ జగనన్న ఇళ్ల స్థలాలకు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేపట్టింది. క్షేత్ర స్థాయిలో ఈ తంతు సరిగా సాగడం లేదు. సాంకేతిక సమస్యలు కూడా తోడవుతున్నాయి. కొందరు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఇప్పటికే స్థలాలు అమ్మేసిన వారు పట్టించుకోవడం లేదు.

కాగా జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న చోట పూర్తిగా వెనకబడింది. ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితర వర్గాలకు ఆ ఇళ్లు ఇస్తామంది. కానీ ఎక్కడా నిర్మాణం చేపట్ట లేదు. సాధారణ గృహాలు కూడా ఏ కాలనీలోనూ పూర్తికాలేదు. మధ్యలో నిలిచి పోయినవే ఎక్కువ. అసలు ఇళ్ల నిర్మాణమే ప్రారంభించని ప్రాంతాలెన్నో. కాలనీలు ప్రభుత్వ ప్రచారానికే ఉపయోగపడు తున్నాయి. ఇళ్ల పట్టాలపై సైతం జగన్ ఫొటోలు, పార్టీ రంగులు వేస్తున్నారు.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 మండలాలో దాదాపు 71,250 మందికి ఇళ్ల స్థలాలను అందించారు. విజయనగరం డివిజన్లో 547, పార్వతీపురం డివిజన్లో 573 లేఅవుట్ల ద్వారా 1830 ఎకరాల్లో ప్రజలకు ఇళ్ల స్థలాలు అందించినట్లు పేర్కొన్నారు. అయితే లబ్ధిదార్లకు ఇచ్చింది మాత్రం సెంటు, సెంటున్నర మాత్రమే. రకరకాల కారణాలతో వారు ఇళ్లు నిర్మించుకోవడం లేదు.
- రిజిస్ట్రేషన్ పూర్తయిన పదేళ్ల తర్వాత ఆ స్థలాన్ని వేరొకరికి విక్రయించుకొనే హక్కు కలుగుతుందని ప్రభుత్వం వెల్లడిస్తుండగా.. లబ్ధిదారులకు కొత్తగా వచ్చే లాభం ఏమీ ఉండదని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. పట్టాలు మంజూరు చేసిన తర్వాత స్థలాలపై సర్వ హక్కులూ లబ్ధిదారులకు ఉంటుంది. వారి తదనంతరం వారసులకు ఆ హక్కు వస్తుంది. కొత్తగా వైసీపీ ప్రభుత్వం కల్పించే హక్కు ఏమిటో అర్థం కావడం లేదని, ఈ రిజిస్ట్రేషన్ పేరిట ప్రభుత్వం లబ్ధిదారుల ఓట్లకు గాలం వేస్తోందని ప్రతిపక్షాలు సైతం విమర్శిస్తున్నాయి.



ఇళ్ల స్థలాల్లో పొదలు

అరకొరగా ప్రక్రియ

వివిధ సచివాలయాల్లో శనివారం వరకు 2680 రిజిస్ట్రేషన్లను పూర్తి చేసినట్లు అధికారిక గణాంకాలు చెపుతున్నాయి. చేయాల్సింది మాత్రం జిల్లా పరిధిలో 70వేలు పైబడి ఉన్నాయి. వీఆర్‌ఓల లాగిన్లో 31,131 అప్‌లోడ్ చేసినప్పటికీ రిజిస్ట్రేషన్లు మాత్రం ఆ స్థాయిలో జరగటం లేదు. దీనికి రకరకాల కారణాలు చెపుతున్నారు. సర్వర్ డౌన్‌తో చేయలేకపోతున్నామని సచివాలయ సిబ్బంది చెపుతున్నారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

లబ్ధిదార్లకు వీఎస్ఆర్ నెంబరు పేరుతో ఐడీ క్రియేట్ చేస్తున్నారు. ఆ ఐడీ నెంబరు ఉన్నవాటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది. నెంబరు ఉన్న లబ్ధిదారు తన ఆధార్ కార్డు తీసుకువెళ్లాలి. సచివాలయంలో వేలిముద్ర ద్వారా బయోమెట్రిక్ వేస్తున్నారు. ఈకేవైసీ చేయించుకుని ఉండాలి. సంబంధిత సచివాలయంలో అడ్మిన్, వీఆర్‌ఓల ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు జరిపేలా ఏర్పాట్లు చేశారు. ఎపుడూ సర్వర్ డౌన్ అంటూ వస్తున్నట్లు సమాచారం. అర్బన్‌లో ఈ ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగుతోంది.



పోలమాంబ అమ్మవారు

పాహిమాం.. పోలమాంబ

- ఘనంగా మూడో వారం జాతర
- శంబరకు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన క్యూలైన్లు
- ఎండ తీవ్రతకు విలవిల

మక్కువ/ సాలూరు రూరల్, ఫిబ్రవరి 6: శంబర పోలమాంబ మూడోవారం జాతరకు భక్తజనం పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో వీధులన్నీ కిటకిటలాడాయి. చదురుగుడి వద్ద క్యూలైన్లన్నీ కిక్కిరిశాయి. రూ.20, రూ.50 క్యూలైన్లు గోముఖీ వంతెన వరకు వచ్చాయి. అయితే దేవదాయ శాఖాధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఎండ తీవ్రతకు భక్తులు విలవిల్లాడిపోయారు. మొత్తంగా క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించిన తర్వాత పోలమాంబను దర్శించుకున్నారు. ఒడిశా, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు గోముఖీ నదీ తీరం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శంబరలోనే వంటలు చేసుకొని కుటుంబాలతో విందు చేశారు. వనంగుడి వద్ద అమ్మవారు భూప్రవేశం చేసిన చెట్టు వద్ద భక్తులు పూజలు చేసి దీపారాధన చేశారు. మొత్తంగా తొలివారం జాతరను తలపించేలా సుదూర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు రావడంతో శంబర గ్రామం భక్తజన సంద్రంగా మారింది. మరోవైపు పోలీసు భద్రతను 150 మంది నుంచి 120 మంది కుదించారు. దీంతో భక్తులను నియంత్రించడానికి పోలీసులు తిప్పలు పడ్డారు. దేవస్థానం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. సాలూరు డిపో నుంచి 15 బస్సులను ప్రత్యేకంగా శంబరకు నడిపారు.



అమ్మవారి దర్శనానికి భక్తుల బారులు

సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించాలి

ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశాలు

గంట్యాడ, ఫిబ్రవరి 6: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలను, పోలింగ్ కేంద్రాలను పోలీసులు నిరంతరం సందర్శించాలని ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశించారు. మంగళవారం గంట్యాడ పోలింగ్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు నిరంతరం గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే సమాచారం అందజేయాలన్నారు. ఆమె వెంట రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

కేటాయిస్తారో.. విస్మరిస్తారో

- రాష్ట్ర బడ్జెట్‌పై అందరి దృష్టి
- ఓటాన్ అకౌంట్ అయినప్పటికీ అత్యవసర నిధులపై ప్రజల్లో ఆశలు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశం



నిలిచిపోయిన తారకరామ తీర్థసాగర్ స్పిల్‌వే నిర్మాణం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించింది. శాశ్వత కార్యక్రమం ఒక్కటీ తలపెట్టలేదు. కీలకమైన ప్రాజెక్టుల ఊసూ లేకపోయింది. చివరిగా మధ్యంతర బడ్జెట్‌ను శాసనసభలో బుధవారం ప్రవేశ పెడుతోంది. ఎన్నికల తరువాత ఏర్పడే ప్రభుత్వమే పూర్తిస్థాయి బడ్జెట్‌ను తీసుకొస్తుంది. అయితే అందరి దృష్టి మధ్యంతర బడ్జెట్ కేటాయింపులపైనే ఉంది. దీనికి కారణం మరో రెండో నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వస్తుండడమే. ఎన్నికల ప్రభావం బడ్జెట్‌పై తప్పకుండా ఉంటుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. అత్యవసర వాటికైనా నిధులు ఇస్తారన్న ఆశను సగటు పౌరులు వ్యక్తం చేస్తున్నారు. గత బడ్జెట్‌లలో సాగునీటి ప్రాజెక్టులు, ఇతర పథకాలకు వందల కోట్ల రూపాయలు కేటాయించారు కాని విడుదల చేయటంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో ఎక్కడికక్కడ పనులు పడకేశాయి. వాటికేమైనా కదలిక తెస్తారేమోనని పలువురు ఆశిస్తున్నారు. వచ్చే మూడు నెలలకు కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయన్నది అందరిలోనూ ఆసక్తిని రేపుతోంది.

తారకరామ తీర్థసాగర్‌పై కినుక

జిల్లా కేంద్రానికి తాగునీరు, నెల్లిమర్ల నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించేందుకు తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టును తీసుకొచ్చారు. దాదాపు రెండు దశాబ్దాలుగా సాగుతున్న ఈ ప్రాజెక్టు పట్ల ఈ ప్రభుత్వ హయాంలో కనీస చొరవ లేదు. ఆఖరిలో ఏదో చేస్తున్నట్లు చెప్పుకునే ప్రయత్నం చేస్తోంది. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.100 కోట్లు అవసరముంది. కొంతైనా నిధులు కేటాయిస్తే మరో మూడు నెలలు పనులు సాగుతాయి. లేకుంటే పూర్తిగా ఆగిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారాది వంతెన సాకారమయ్యేనా?

బొబ్బిలి మండలంలోని పారాది వంతెన ఒక వైపు కూలిపోయింది. దిగువ నుంచి ఇరన్ స్టేండ్లు ఏర్పాటు చేసి వంతెనను నిలబెట్టారు. మూడు నెలలుగా ఈ వంతెన పైనుంచి భారీ వాహనాలను అనుమతించడం లేదు. ప్రస్తుత బడ్జెట్లో రూ.10 కోట్లు మేర అయినా కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే వంతెన నిర్మాణం కష్టమే.

సువర్ణముఖీ వంతెన కొలిక్కివచ్చేనా?

సువర్ణముఖీ నదిపై బొబ్బిలి-సీతానగరం మండల కేంద్రాల మధ్య వంతెన నిర్మాణానికి రూ.11కోట్లు మంజూరు చేశారు. కాని బిల్లులను ప్రభుత్వం సక్రమంగా చెల్లించడంలేదు. దీంతో కాంట్రాక్టర్ పిల్లర్ల నిర్మాణాలు పూర్తి చేసి పనులు విడిచి పెట్టి వెళ్లిపోయాడు. ఏడాది కాలంగా నదిలో మొండి పిల్లర్లతోనే వంతెన దర్శనమిస్తోంది. రూ.10 కోట్లు కేటాయిస్తే బిల్లుల బకాయిలు, పెండింగ్ పనులు, అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అవకాశం ఉంది.

తోటపల్లిదీ అదే గోడు

తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు కాల్వలు బొబ్బిలి మండలం నుంచి గుర్ల మండలం వరకు విస్తరించి ఉన్నాయి. అయితే పెండింగ్ బిల్లులు, పెండింగ్ పనులు, భూ సేకరణ కోసం ఇంకా రూ.350 కోట్లు వరకు అవసరం ఉంటుందని అంచనా. ప్రస్తుత బడ్జెట్లో రూ.310 కోట్లు కేటాయించాలని నీటి పారుదల శాఖ ప్రభుత్వానికి నివేదించింది. మరి ఏ స్థాయిలో నిధులు కేటాయిస్తుందో చూడాలి.

వ్యవసాయ రాయితీలేవీ?

జిల్లాలో ఎక్కువ శాతం మంది వ్యవసాయంపై ఆధార పడుతున్నారు. రైతులకు వివిధ రాయితీలు అందించి సాగును ప్రోత్సహించాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాయితీలు ఎత్తివేసింది.



పారాది వంతెన కింద ఐరన్ పిల్లర్లు

చిన్న పొరపాటు కూడా జరగకూడదు

- పోస్టల్ బ్యాలెట్లు చాలా కీలకం
- శిక్షణలో కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఎన్నికల తంతులో చిన్న పొరపాట్లు కూడా జరగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు ఎంతో కీలకమని, వాటి తయారీ, జారీ, స్వీకరణలో లోపాలు తలెత్తకూడదని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల శిక్షణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీలుగా ఎంపికైన డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.సందీప్ కుమార్ శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు, ఓటింగ్, కౌంటింగ్ విధానాల్లో పలు మార్పులు వచ్చాయని చెప్పారు. అవన్నీ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల్లో స్పష్టంగా ఉన్నాయని, వీటిని పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నికల విధుల్లో ఉన్నవారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్లు జారీ చేసేవారని, ఇప్పుడు ఆబ్సెంట్ ఓటర్ల విధానం కూడా వచ్చిందని తెలిపారు. దీనిలో భాగంగా 80 సంవత్సరాల వయసు దాటిన వారు, 40 శాతం పైబడిన దివ్యాంగత్వం ఉన్న విభిన్న ప్రతిభావంతులు, కొవిడ్ వ్యాధిగ్రస్తులు, అత్యవసర సర్వీసుల్లో ఉన్నవారు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునే ఆవకాశాన్ని కల్పించారని వివరించారు. వీరంతా తాము ఇంటి వద్ద నుంచే ఓటు వేస్తామని కోరితే ఆ మేరకు ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ లెక్కించేందుకు అవసరమైతే ప్రత్యేక కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సర్వీసు ఓటర్లకు మాత్రం ఆన్‌లైన్ ద్వారా బ్యాలెట్ పత్రం పంపబడుతుందన్నారు. వీరు ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సి అవసరం లేదని చెప్పారు. వీరి బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు మాత్రమే ఉంటాయని, పార్టీ గుర్తులు ఉండవని వివరించారు. ప్రతి బ్యాలెట్ పత్రంపైనా ఆఖర్లో నోటా తప్పనిసరిగా ఉంటుందని చెప్పారు. బ్రెయిలీ లిపిలో నమూన బ్యాలెట్ పత్రాన్ని కూడా పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. టెండరు బ్యాలెట్ పేపరు ఈవీఎంలో ఉన్న బ్యాలెట్ పత్రంలాగే ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, ట్రైనీ కలెక్టరు వెంకట్ త్రివినాగ్, డీఆర్‌వో అనిత తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల ధర్నా

కలెక్టరేట్, ఫిబ్రవరి 6: సమ్మె ఒప్పంద జీవోలను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గతంలో 16 రోజుల సమ్మె చేసినప్పుడు మంత్రివర్గంలో రాతపూర్వకంగా ఇచ్చిన హామీని విస్మరించారని గుర్తుచేశారు. క్లీన్ ఎన్విరాన్మెంటల్ వర్కర్స్‌కు రూ.21,000, డ్రైవర్లుకు రూ.24,500 జీతం వర్తింపజేస్తూ తక్షణమే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, పంప్ హౌస్, క్లాప్ వాహన డ్రైవర్లు, ప్లాంటేషన్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. జీవో 30ను సవరించి స్కిల్, సెమిస్కిల్ వేతనాలు అమలు, పంపు హౌస్, ప్లాంటేషన్ కార్మికులకు బకాయిల జీతాలు చెల్లించాలని.. ఆప్కాస్‌లో చేర్చించాలని డిమాండ్ చేశారు.

వేటకు వెళ్తుండగా ప్రమాదం

రెండు పడవల మధ్య చిక్కుకుని మత్స్యకారుని మృతి

పూసపాటిరేగ, ఫిబ్రవరి 6: చింతపల్లి తీరంలో సముద్రంలో చేపలవేటకు వెళ్తూ జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బర్రి బ్రహ్మజీ(33)మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోజులాగే మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో వేటకు బయలుదేరాడు. లోపలకు వెళ్లాక పడవను ఎక్కుతున్న క్రమంలో పెద్ద అల ఆ పడవను ఢీకొంది. అంతలో పక్కనే ఉన్న మరొక బోటు కూడా వచ్చి బ్రహ్మజీని బలంగా ఢీకొనటంతో రెండు పడవల మధ్య చిక్కుకొని సముద్రంలో పడిపోయాడు. మిగిలిన మత్స్యకారులు అతన్ని తీరానికి తీసుకొచ్చి సుందరపేట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బ్రహ్మజీకి భార్య శుభద్రతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. జిల్లా మత్స్యకార సంఘం సొసైటీ అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న ఆ కుటుంబాన్ని పరామర్శించారు.



బ్రహ్మజీ(ఫైల్)

డీఈవోగా ప్రేమ్‌కుమార్

● లింగేశ్వరరెడ్డికి ఆర్జేడీగా గుంటూరు బదిలీ

(విజయనగరం-ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారిగా ప్రేమ్‌కుమార్ నియామకమయ్యారు. ఈయన ఇప్పటివరకు పార్వతీపురం డీఈవోగా బాధ్యతలు చూస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న బి.లింగేశ్వర రెడ్డికి ఆర్జే డీగా పదోన్నతి ఇస్తూ గుంటూరుకు బదిలీ చేశారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలు మంగళవారం రాత్రి విడుదలయ్యాయి. అలాగే విజయ నగరం డిప్యూటీ డీఈవోగా పనిచేస్తున్న వాసుదేవ రావుకు కూడా ఉద్యోగో న్నతి లభించింది. ఈయన డీఈవోగా రాజమండ్రికి బదిలీ అయ్యారు.

రూ.27 కోట్లతో ఉపాధి 'లేబర్ బడ్జెట్'

రామభద్రపురం, ఫిబ్రవరి 6: ఈ ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా రూ.27 కోట్లతో లేబర్ బడ్జెట్ రూపొందించినట్టు ఏపీవో జి.త్రినాథరావు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6 లక్షల మందికి మేండెంట్స్ కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత సరోవర్ ట్యాంక్స్ కింద 5 పనులు, మినీ అమృత సరోవర్ కింద 50 పనులు, హార్టికల్చర్ కింద 200 ఎకరాల్లో అభివృద్ధి పను లు చేస్తున్నామని తెలిపారు. నాలుగు వేల మంది వేతనదారులకు వంద రోజులు పని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 22 గ్రామ పంచాయతీల్లో పూర్తి స్థాయిలో వేతన దారులకు పనులు కల్పించడానికిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నర్సాపురం, రావివలస గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో టెక్నికల్ అసిస్టెంట్‌ల ద్వారా పనులు చేపడుతున్నామని త్రినాథరావు తెలిపారు.

ఇళ్లను తొలగించడం దారుణం

దాసన్నపేట: నగరంలోని బొంకుల దిబ్బ దళితుల ఇళ్లను తొలగించడం అన్యాయమని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తొలగించిన ఇళ్ల వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు ఆర్డరు ఉన్నా అన్యాయంగా ఇళ్లను తొలగించారన్నారు. నివాసం ఉంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి మజ్జిగౌరి అమ్మవారి జాతర

రాజాం రూరల్: మండలంలోని అంతకాపల్లిలోని శ్రీ మజ్జిగౌరి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 16 నుంచి 18 వరకు జరగనున్నాయి. జాతర ఉత్సవాల నిర్వహణ కమిటి సారథ్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకూ మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మూడురోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల ముగింపురోజున మధ్యాహ్నం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఒడిషాలోని రాయఘడ తరువాత అంతకాపల్లిలో మాత్రమే మజ్జిగౌరి అమ్మవారి దేవాలయం ఉండడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

215 మందికి వైద్య పరీక్షలు

బొబ్బిలి: స్థానిక గొడవీధి అభ్యుదయ హైస్కూల్లో మంగళవారం అభ్యుదయ ఫౌండేషన్, అభ్యుదయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆ సంస్థల అధినేతలు ఎంకె నాయుడు, డాక్టర్ చింతా శారద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిషియన్, గైనకాలజీ, పీడియాట్రిక్, క్యాన్సర్, జనరల్ సర్జరీకి చెందిన వైద్యులు సుమారు 215 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

విజయనగరం క్రైం: రోడ్డు భద్రత నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని డీఎస్పీ ఆర్.గోవిందరావు అన్నారు. ఎన్‌జీఓ అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో సభ్యులు డీఎస్పీని కలిసి రోడ్డు భద్రత నియమాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నుంచి దూరం కావచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రతినిధులు శ్రీహరిబాబు, ఎక్కస్వారావు, కరుణాంకుశం, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

రామభద్రపురం: త్వరలో జరగబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు ఎలా వినియోగించడం అనే దానిపై అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్‌పై మంగళవారం నుంచి వారం రోజుల పాటు ఓటర్లకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కళ్యాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కావాలి

జామి, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలో ఉన్న ఎంఆర్‌సీ భవనం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో పాత పెన్షన్ విధానం కావాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించారు. పాత పింఛను విధానం అమలు చేసే పార్టీలకే తమ ఓటు అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, వాసుదేవరావు, శ్రీధర్, దేముడు బాబు, అడివమ్మ, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్లకు దరఖాస్తులు

శృంగవరపుకోట/జామి, ఫిబ్రవరి 6: అంబదా సుపాలేనికి చెందిన గడి బంగారునాయుడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ తనకు కేటాయించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు శరగడ రమేష్ ద్వారా అధిష్టానానికి దరఖాస్తు చేశారు. జామి మండలం భీమసింగి గ్రామానికి చెందిన సుంకరి గణేష్ గజపతినగరం నియోజకవర్గం కాంగ్రెస్ టిక్కెట్ కోసం దరఖాస్తు చేశారు.

బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

రాజాం, ఫిబ్రవరి 6: బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలని.. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగరాదని రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాల్లో మరణించిన వారి పేర్లు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్, పార్టీ నాయకులు గురవాన నారాయణరావు, బండి నర్సింహులు, శ్రీరంగం, మిత్తిరెడ్డి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం

● బాబు ష్యూరిటీలో అదితి గజపతిరాజు



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు, నాయకుల సమక్షంలో మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 6: పట్టణంలోని వివిధ డివిజన్ల పరిధిలో మంగళవారం అదితి గజపతి రాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 42, 46 వార్డుల పరిధిలోని దండు మారమ్మ కోవెల, కాళీఘాట్ కాలనీ, తారకరామ కాలనీ, యాత వీధి, గొల్లవీధి, అగురు వీధి, మహంతి వీధి, చాకలవీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాన్ని కాపాడాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు.

టీడీపీలో చేరికలు

విజయనగరం రూరల్: టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతి రాజు సమక్షంలో వైసీపీ మద్దతు కుటుంబాలు కొన్ని టీడీపీలో చేరాయి. మంగళవారం 3వ డివిజన్‌కు చెందిన పత్తి సంతోష్, చాటోజు మోహన్, శేఖర్ తదితరులు మత్స్యకార సంఘం నుంచి 1, 4వ వార్డులకు చెందిన ఎ రామకృష్ణ, ఎస్ దుర్గారావు, బి.ఎల్లాజి తదితరులతో సహా ఆయా కుటుంబాలు టీడీపీలో చేరాయి.

ఇళ్ల కూల్చివేత అన్యాయం

విజయనగరం రూరల్: పట్టణంలోని 40వ డివిజన్ పరిధిలోని బొగ్గుల దిబ్బ ఎస్సీ కాలనీలో గత 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న దళితుల ఇళ్లను కొంత మంది వైసీపీ నాయకుల ప్రోద్బలంతో తొలగించడం అన్యాయమని ఆరోపిస్తూ 18 కుటుంబాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. వారి వాదనలు విన్న న్యాయస్థానం బుధవారం నాటికి కేసును వాయిదా వేసింది. ఇంతలోనే ఒక రోజు ముందుగా మంగళవారమే గృహాలను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు తదితర నాయకులు అక్కడికి చేరుకున్నారు. బాధితులను కలిసి ధైర్యం చెప్పారు. మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతూ బుధవారం కోర్టు వాయిదా ఉన్నందున అప్పటి వరకు ఆగాలని కోరారు. అయినప్పటికీ వినిపించుకోని మున్సిపల్ సిబ్బంది కూల్చివేతను కొనసాగించారు. చట్టానికి కూడా వైసీపీ నాయకులు గౌరవం ఇవ్వకుండా దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇళ్లల్లోని సామాన్లు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకపోవడం వైసీపీ నాయకుల దౌర్జన్యానికి నిదర్శనమన్నారు.

చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం



టీడీపీ నాయకులను అభినందిస్తున్న కొళ్ల

రాజాం, ఫిబ్రవరి 6: చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొళ్ల అప్పలనాయుడు అన్నారు. మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ సూచనల మేరకు సంతకవిటిలో జయహో బీసీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్, స్కూల్ స్టడీ సర్కిల్, స్కిల్ డెవలప్‌మెంట్, విదేశీ విద్యా పథకం తదితర 30కి పైగా బీసీ సంక్షేమ పథకాలను సీఎం జగన్ రద్దు చేశారన్నారు. 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా బీసీల సంక్షమానికి తూట్లు పొడిచారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గట్టి భాను, గురవాన నారాయణరావు, నాగళ్ల అప్పలనాయుడు, మొయ్యి నారాయణప్పుడు, వల్లూరు గణేష్, బొడ్డేపల్లి సూర్యనారాయణ, ఎడ్ల శ్రీనివాస్, ఎన్ని చిన్నారావు, తమ్మినేని సింహాచలం, వావిలపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

● సెక్టార్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్ల సమావేశంలో ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి, ఫిబ్రవరి 6: ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దని, ఓటర్ల జాబితాలో మృత ఓటర్లను తొలగింపునకు ఎటువంటి సందిగ్ధత అవసరం లేదని ఆర్డీవో ఎ.సాయిశ్రీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ఎన్నికల నిర్వహణాధికా రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు ఉంటే వాటిని పక్కాగా నిర్ధారించుకుని తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలో పలు తప్పిదాలను ఎత్తిచూపుతూ పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, వాటిని సరిచేసుకోవాలన్నారు. సెక్టారు ఆఫీసర్లు, సూపర్ వైజర్లు, బీఎల్‌వోలు అందరూ తహసీల్దారు, ఇతర అధికారులతో సమన్వయంగా ఉండాలని, బీఎల్‌ఓలు తమ పాస్‌వర్డ్‌లను ఇతరులతో ఎట్టిపరిస్థితుల్లో షేర్ చేసు కోరాదని, గోప్యత పాటించాలని లేకుంటే క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతారన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలన్నిటినీ హేండ్ బుక్‌లో నుంచి అధ్యయనం చేసుకోవాలని ఆమె హితవు పలికారు. ఈ ఎన్నికలను సమిష్టి కృషితో పారదర్శకంగా పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీఓ పిలుపునిచ్చారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్‌లు సాయికృష్ణ, గౌరీశంకర్, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల తహసీల్దార్లు, ఎన్నికల నిర్వహణాధికారులు, సెక్టారు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దుతాం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 6: ఓటర్ల జాబితాల్లో తప్పులను 90 శాతం వరకు సరిదిద్దామని, మరో రెండు రోజుల్లో చిన్న చిన్న తప్పులను కూడా సరిచేసి జాబితాను సిద్ధం చేస్తామని తహసీల్దార్ డీజీఎంఎస్ ప్రసాదరావు తెలిపారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ఓటరు జాబితాల్లోని తప్పులపై కథనం ప్రచురితమైంది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వీటిని సరిచేసే పనిలో పడ్డారు. గ్రామాల్లో లేనివారికి నోటీసులు జారీ చేశామని, చనిపోయిన వారి ఓట్లను తొలగించామన్నారు. ఎక్కడైనా తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల నుంచి వసూళ్లపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేగిడి, ఫిబ్రవరి 6: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల నుంచి ప్రైవేటు వ్యక్తులు ఒక సంస్థ పేరుతో వసూళ్లకు పాల్పడటంపై రేగిడి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారం వెనక ఎవరు ఉన్నారు? వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులు ఎవరు అన్న విషయమై దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. ఇసుక ట్రాక్టర్ల నుంచి వసూళ్లపై ఈ నెల 5న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురణ కావడం... మరోవైపు అపరాధ రుసుం కట్టిన ట్రాక్టర్ ఓనర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వటంతో పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇదిలాఉండగా మంగళవారం ఇదే టీమ్ గురవాం వద్ద మరికొన్ని ట్రాక్టర్లకు అపరాధ రుసుం విధించేందుకు ప్రయత్నించగా డ్రైవర్లు ఎదురు తిరిగినట్లు సమాచారం. అక్రమ రవాణా కావటంతో బయట పెట్టేందుకు ట్రాక్టర్ డ్రైవర్లు ముందుకు రావడం లేదు. దీనిపై రాజాం సీఐకి సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల ర్యాలీ



భద్రతావారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్లు పాటించాల్సిన నియామాలపై విద్యార్థులు ప్రచారం చేశారు.

'మా సమస్యలు పరిష్కరించండి'

విజయనగరం రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని సైకిల్.. రిక్షా మెకానిక్ వర్కర్ల యూనియన్ నాయకులు, సభ్యులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజును మంగళవారం కలిశారు. అశోక్ బంగ్లాకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. అనంతరం వినతి పత్రం అందించారు. తమకు ప్రస్తుతం సరైన ఉపాధి లభించడం లేదని, ప్రభుత్వం కూడా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి భద్రత లేని తమకు న్యాయం చేయలని కోరారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



పిల్లల సామర్థ్యాలను ప్రశ్నిస్తున్న ఎంఈవో

రేగిడి, ఫిబ్రవరి 6: పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో వరప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. పోరాం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లల అభ్యసన సామర్థ్యాలు, రివిజన్‌పై హెచ్‌ఎం దూబ రమేష్, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఖండ్యాం హైస్కూల్‌లో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంను పర్యవేక్షించారు. ఆయన వెంట ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి



సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

రామభద్రపురం, ఫిబ్రవరి 6: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందు బాటులో ఉంటూ సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆదేశించారు. కొట్టక్కి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. అనంత రం హౌసింగ్ రిజిస్ట్రేషన్లపై గ్రామ కార్యదర్శి పడాల భాస్కరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జామి, ఫిబ్రవరి 6: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జామికి చెందిన గొర్లె రామునాయుడు(26) విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల విధులకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందు తూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: జాడపేటలో 20 మద్యం సీసాలతో మంగళవారం వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి... కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

ఎద్దుకు అంత్యక్రియలు

శృంగవరపుకోట రూరల్: మామిడిపల్లిలో మృతి చెందిన ఎద్దుకు శృంగవరపుకోట దాసరి కులవాసులు మంగళవారం సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. వీరు సింహాచలం సింహాద్రి అప్పన్నకు ప్రతిరూపంగా కొలిచే ఎద్దు మామిడిపల్లిలో మృత్యువాత పడింది. ఈ విషయం తెలుసుకున్న శృంగవరపుకోట దాసరి కులస్థులు గ్రామానికి చేరుకొని.. మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

రాజాం: వంగర మండలం రాజులగుమ్మడ గ్రామం వద్ద సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ్వాం గ్రామానికి చెందిన 15 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. వీరు ప్రస్తుతం జీఎంఆర్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను మంగళవారం నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త ఎన్ని రాజు పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండటంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఆయనతో పాటు నాలుగు మండలాల జనసైనికులు ఉన్నారు.

గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 6: బొడ్డవర చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం కారులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. కారు ఆపిన వెంటనే డ్రైవర్ పారిపోయినట్టు సమాచారం. అందులో ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళ ఉన్నారని, గంజాయి బ్యాగులు ఉన్నట్టు తెలిసింది. ఈ విషయంపై ఎస్.కోట పోలీసులను వివరణ కోరగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలు బుధవారం తెలియజేస్తామన్నారు.

కరాటేలో పతకాలు



పతకాలతో విద్యార్థులు

లక్కవరపుకోట (కొత్తవలస), ఫిబ్రవరి 6: మండలంలో ఒకినావో చాంపియన్ కరాటే డోజో శిబిరం నుంచి ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించినట్టు కోచ్ సూర్యనూకరాజు తెలిపారు. ఏడో అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ 2024 ఆల్ స్టైల్స్ ఇన్విటేషన్ పోటీల్లో పతకాలు వచ్చాయని తెలిపారు. కొత్తవలస నుంచి అయిదుగురు పాల్గొనగా ముగ్గురు మెడల్స్ సాధించారన్నారు. ఎం.గోవర్ధన్ కటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. పి.నాగవెంకట వంశీ రెండు రజతాలు, కె.లక్ష్మీదీపక్ కటా విభాగంలో బంగారు, కుమిటే విభాగంలో వెండి పతకం సాధించినట్లు కోచ్ తెలిపారు.

ఇదేనా అభివృద్ధి?

● విజయనగరంలో అంతా పైపై మెరుగులే

● కానరాని పూర్తి స్థాయి పనులు



గాంధీ పార్కులో ప్రమాదకరంగా జారుడు బల్లలు



ఉల్లి వీధిలో పైపులు వేసేందుకు తవ్విన రోడ్డు..

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా కేంద్రానికి మెరుగులు దిద్దుతున్నారు. శాశ్వతంగా నిలవాల్సిన పనులను విస్మరిస్తున్నారు. నగర సుందరీకరణ పేరుతో పెద్దచెరువు చుట్టూ హడావిడి చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం వేసిన రోడ్లపై కూడా మళ్లీ తారు పూస్తున్నారు. నగరంలోని అంబటి సత్తర్వు నుంచి కొత్తపేట నీళ్లట్యాంకు వెళ్లే రోడ్డు ఏళ్ల పాటు వదిలేసి తాజాగా శంకుస్థాపన చేశారు. మిగతా రోడ్లను వదిలేశారు. నగరంలో కొన్ని పార్కుల పరిస్థితి అధ్వానంగా మారింది. గాంధీ పార్కులో పిల్లలు ఆడుకునే ఆట వస్తువులన్నీ పోయాయి. నగరంలో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నా పట్టించుకోవడం లేదు.



పెద్దచెరువు గట్టుపై, గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం పనిచేస్తున్న కూలీలు



తోటపాలెం బాలజీనగర్‌లో పందుల గుంపు

జయహో బీసీ సదస్సును విజయవంతం చేయండి

లక్కవరపుకోట: రంగారాయపురం గ్రామం విశాఖ-అరకు హైవే రోడ్డు మార్గంలో మాజీ జెడ్పీటీసీ కొరెడ్ల ఈశ్వరరావు తోటలో బుధవారం నిర్వహించనున్న జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు చొక్కాల మల్లునాయుడు కోరారు. ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. మాజీ ఎంపీపీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంవీఐ రవిశంకర ప్రసాద్

విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి 6: రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవి శంకర్‌ప్రసాద్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటపుడు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నుంచి బయట పడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ అనీలా సునందని, డాక్టర్ పీఏ రమణి, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ సాయికుమార్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీవోల జారీలో అలసత్వం వద్దు

మున్సిపల్ కార్మికుల ధర్నా

రాజాం రూరల్, ఫిబ్రవరి 6: మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందపు జీఓలను జారీ చేయడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని సిటు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు విమర్శించారు. ఇక్కడి మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కార్మికులు సమ్మె విరమించి నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం జీఓలు జారీ చేయలేదని, వెంటనే జీఓలను జారీ చేయడం ద్వారా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, గురువులు, లక్ష్మి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మునిసిపల్ పార్కు ముందే చెత్త



పార్కు ముందు కుండీలో పేరుకుపోయిన చెత్త

బొబ్బిలి: స్థానిక రాణీ మల్లమ్మదేవి మున్సిపల్ పార్కు, తాగునీటి రిజర్వాయరు, శ్రీకళాభారతి ఆడిటోరియంలు కలిసి ఉన్న కూడలి ముందు మున్సిపల్ చెత్తకుండీ నిండి పోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ పక్కనే ఇటీవల రోట రీక్లబ్ నిర్వహించిన బస్‌షెల్టరును ప్రారంభించారు. బస్సులు, ఆటోల కోసం వేచి ఉండే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ పక్కనే చేపల విక్రయం జరుగుతోంది. ఈ చెత్త కుండీని వేరొక చోటకు తరలించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్య వైఖరి తగదు

నెల్లిమర్ల: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని జిల్లా ఓబీసీల అధ్యక్షుడు దంతినాడ అప్పలచారి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని, సక్రమంగా అమలు చేయాలని కోరారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి

నెల్లిమర్ల: నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఈఆర్వో ఎం.నూకరాజు పేర్కొన్నారు. మంగళవారం నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుది జాబితాలో ఎలాంటి తప్పిదాలు ఉన్నా వెంటనే బీఎల్‌వోలకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో డి.ధర్మరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారులు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, సీపీఎం నాయకులు కిల్లంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు: ఈఆర్వో


మాట్లాడుతున్న ప్రమీలాదేవి

గజపతి నగరం: ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీల నేతలు చిన్న పిల్లలతో ర్యాలీలు, జెండాలు, ఫ్లెక్సీల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఈఆర్వో ప్రమీలాదేవి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల అధికారుల ఉత్తర్వులను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓ రమేష్, ఎన్నికల ఉప తహ సీల్దార్ సతీష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తెర్లాం: మండలంలోని పోలింగ్ కేంద్రాలను సీఐ తిరుమలరావు మంగళవారం పరిశీలించారు. నందిగాం, రాజుపేట పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. పంచాయతీ పేరు, బీఎల్‌వో పేరు, పోలింగ్ బూత్, ఫోన్ నెంబర్లను ఓటర్లకు అర్థమయ్యేలా రాయాలన్నారు. విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్స్, ట్యూబ్‌లైట్లు, ర్యాంపు, నీటి సదుపాయం, మరుగుదొడ్లు, తలుపులు తదితర వాటి నిర్వహణపై ఆరా తీశారు. ఆయన వెంట ఎస్ఐ రమేష్ ఉన్నారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు గిరిధర్


నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

రాజాం రూరల్: ప్రతి ఒక్కరిలోనూ శాస్త్రీయ దృక్పథం పెరగాలని దీని కోసం జనవిజ్ఞాన వేదిక ఎన్నో కార్యక్రమాలు రూపొందించిందని ఆ సంస్థ రాష్ట్ర నాయకుడు గొంటి గిరిధర్ పేర్కొన్నారు. ప్రజా సైన్స్ కళాయాత్రలో భాగంగా మంగళవా రం రాత్రి పొనుగుటివ లస గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైన్స్ నృత్య రూపకాలు, నాటికలు, గీతాలాపన, మ్యాజిక్ ప్రదర్శన, ప్రయో గాలను కళాకారులు ప్రదర్శించారు.కార్యక్రమంలో జేవీవీనాయకులు సత్యనా రాయణ, అప్పలనాయుడు, పాపారావు, నీలయ్య, వేణుగోపాల్, రెడ్డి మోహనరావు, గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం యూత్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో మూడు ఉపాధి శిక్షణ కోర్సులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైటీసీ ఇన్‌చార్జి వీవీ రాము తెలిపారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో ఆయనవిలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ గిరిజన యువతకు రిటైర్డ్ స్టోర్ మేనేజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, నర్సింగ్ కోర్సుల్లో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు.

‘తప్పు చేస్తే శిక్ష తప్పదు’

పాలకొండ: తప్పుచేస్తే ఏ వయస్సు ఉన్నవారికైనా శిక్ష తప్పదని శ్రీకాకుళం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మంగళవారం పాలకొండ సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కేసుల్లో రిమండ్‌లో ఖైదీల వివరాలను జైలు సూపరింటెండెంట్ బి.జోగులును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోర్టు సిబ్బంది కిరణ్మయి, జైలుహెడ్ వార్డర్స్ పిచం ద్రరావు, విజయ్‌కుమార్, హేమసుందరరావు ఉన్నారు.

టెన్నీకాయిట్‌లో సత్తాచాటిన తలవరం విద్యార్థి

పాలకొండ: మండలంలోని తలవరం ఉన్నత పాఠశాల విద్యార్థి బొద్దాన రాజు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం జడ్పీ ఉన్నతపాఠశాలలో ఈనెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకూ నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ అండర్-17 విభాగంలో సత్తాచాటాడు. బంగారు పతకం సాధించినట్లు హెచ్‌ఎం అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాజుకు హెచ్‌ఎంతో పాటు పాఠశాల పీడీ మజ్జి రామకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు అభినందించారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

పాలకొండ: పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తేచర్యలు తప్పవని నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ)వైద్యుడు భాస్కరరావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలకు రెండుసార్లు ప్రత్యేక డ్రైవ్ చేపడతామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలఆవరణలో ధూమపానం చేయడం, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమన్నారు. పలు దుకాణాల నుంచి పొగాకు ఉత్పత్తుల సరుకుస్వాధీనం చేసుకుని వెయ్యిరూపాయల జరిమానా విధించారు. తనిఖీల్లో హెల్త్ విజిటర్ జె.రమణమ్మ, నత్తల కళ్యాణ్ ప్రసాద్, పోలీసులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కురుపాం రూరల్: మూలిగూడ జంక్షన్ వద్ద మం గళవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో దండుసూర గ్రామానికి చెందిన కొండగొర్రి సూర్యనారాయణ (30) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మూలిగూడ జంక్షన్‌లోని రోడ్డు మలుపు వద్ద ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన స్టాపర్‌ను ద్విచక్రవాహనంపై వస్తున్న సూర్యనారాయణ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సూర్య నారాయణ తన పనులకోసం స్వగ్రామం నుంచి కురుపాం వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ మేరకు ఆయన్ను కురుపాం ఆసుపత్రిలో ప్రథమ చికి త్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు.

కలగా రైతుబజార్ ఏర్పాటు

- బొబ్బిలిలో రోడ్డుపైనే కూరగాయ విక్రయం
- వినియోగదారులకు తప్పని అవస్థలు


రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

బొబ్బిలి: బొబ్బిలిలో రైతుబజారు ఏర్పాటు కలగా మారింది. ఇక్కడ ఎన్నికల ముందు రైతుబజారు ఏర్పాటుచేస్తామని నాయకులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పట్టణంలో 75 వేలకుపైగా జనాభా ఉండగా, వివిధ మండలాలకు చెందిన వందలాది కుటుంబాలు ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటుచేసుకున్నాయి. ఇక్కడ నుంచి నుంచే పది మండలాలకు ప్రభుత్వోద్యోగులు, చిరువ్యాపారులు రాకపోకలను సాగిస్తుంటారు. అయితే ఇక్కడ రైతుబజారు లేకపోవడంతో వినియోగదారులు అవస్థలుపడుతున్నారు.

రోడ్లపై విక్రయం..

- చినబజారు జంక్షన్‌లో మార్కెట్ బయట రోడ్డుపై కూరగాయలు రైతులు విక్రయిస్తున్నారు. ● బొబ్బిలి మునిసిపల్ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కనే మండుటెండలో కూరగాయలను విక్రయిస్తున్నామని రైతులు వాపోతున్నారు. ● కాలేజీ రోడ్డులో, కృష్ణాటాకీస్ తదితర జంక్షన్లల్లో కూడా ఎండకు ఎండి వర్షానికి తడిచి కూరగా యలు విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులకు కూడా అవస్థలు తప్పడంలేదు. ● కొందరు వ్యాపారులు రామభద్రపురం జంక్షన్ నుంచి కొనుగోలు చేసుకొని ఇక్కడ అమ్ముతున్నారు. ● కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏఎంసీ ఛైర్మన్‌గా పనిచేసిన ఇంటి గోపాలరా వు చొరవతో స్థానిక డీసీఎంఎస్ గోదాముల స్థలంలో తాత్కాలికంగా షెడ్లను నిర్మించి రైతుబజారును ఏర్పాటుచేసినా అది మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. తాత్కాలిక రైతు బజారును కూడా పూర్తిగా ఎత్తివేయడంతో రోడ్లపైనే వినియోగదారులు కొనుగోలు చేసుకోవల్సివస్తోంది. ● పట్టణంలో మెయిన్ రోడ్డులో రెండు వసతిగృహాలు, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, అన్నక్యాంటీన్ భవనాలు వృథాగా పడిఉన్నాయి. ఆ భవనాలు శిథిలావస్థకు చేరి విషసర్పాలకు నిలయంగా మారాయి. అత్యంత విలువైన ఆ స్థలాలను రైతుబజారు వంటి వాటికి వినియోగించుకోకుండా వృథాగా వదిలివేయడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

హడావుడి చేసి అటకెక్కించారు..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో స్థానిక మేదరబంద షాపింగ్ కాంప్లెక్స్ వెనుక గల బందను చదును చేసి రైతుబజారు ఏర్పాటు చేస్తామని హడావుడి చేశారు. నిబంధనల ప్రకారం చెరువులు, బందలను ఎటువంటి కార్యకలాపాలకు ఉపయోగించకూ డదని ఉన్నతాధికారులు స్పష్టంచేయడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. పట్టణంలో పలు చోట్ల ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఉన్నా రైతు బజారును ఏర్పాటులో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

స్థల సమస్య వల్ల ఏర్పాటు కాలేదు..

బొబ్బిలి రైతుబజారు ఏర్పాటు కోసం ప్రభుత్వం దగ్గర ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ తెలిపారు.అయితే గతంలో ఎంపిక చేసిన స్థలాలపై సాంకేతిక సమస్యలు ఉండడంతో అక్కడ ఏర్పాటు చేయడం సాధ్యం కాలేదని చెప్పారు. తగిన స్థలం ఎంపిక చేసి అప్పగించాలని రెవెన్యూ యంత్రాంగానికి పలు దఫాలు తమ అధికారులు కోరినట్లు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండే స్థల సేకరణ కోసం కసరత్తు జరుగుతోందని చెప్పారు.

ఒకే చోట కొనుగోలు చేయవచ్చు..



రైతుబజారు ఏర్పాటైతే సరసమైన ధరలకు పలు రకాల కూరగాయలు అందుబాటులో ఉంటాయి. ఒకేచోట అన్నింటినీ కొనుగోలు చేసుకోవచ్చు. దళారుల ప్రమేయం తగ్గుతుంది. కూరగాయలు పండించే రైతులకు కూడా బాగా వెసులుబాటుగా ఉంటుంది. నడిరోడ్లపై ఎండ, వానతో కూరగాయలు అమ్ముకునే దృశ్యాలు దయనీయంగా ఉన్నాయి.

-జి.అప్పలనాయుడు, ఉపాధ్యాయుడు

రైతుబజారు చాలా అవసరం..



బొబ్బిలి పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చాలా అవసరం. ప్రభుత్వం స్పందించి వెంటనే ఇక్కడ రైతు బజారును ఏర్పాటు చేయాలి. పదేళ్ల నుంచి ఈ మాట వింటున్నాము తప్ప ఏర్పాటు కావడం లేదు.

-గంజి కృష్ణమూర్తి, రిటైర్డ్ ఉద్యోగి

వైసీపీ విధానాలపై విసుగెత్తిన ప్రజలు

- నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బంగార్రాజు
- వెళ్దూరు సర్పంచ్‌తోపాటు 300 కుటుంబాలు చేరిక

పూసపాటిరేగ: వైసీపీ విధానాలపై విసుగెత్తిన ప్రజలు, నాయకులు తమ పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నారని నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. మంగళవారం మండలంలోని వెళ్దూరు పంచాయతీవైసీపీకి చెందిన సర్పంచ్ నాయని సత్యవతి, నలుగురు వార్డు సభ్యులతో పాటు సుమారు 300 కుటుంబాలు టీడీపీలో చేరాయి.వెళ్దూరులో నిర్వహించిన కార్యక్రమంలోబంగార్రాజు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు తోపాటు నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాల పార్టీ నాయకుల సమక్షంలో వారు చేరారు.ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ నియో జకవర్గంలో నలుమూలల నుంచి పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినాయుడు, ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకులు రవిశేఖర్, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు ఆకిరి ప్రసాదరావు, పార్టీ మండలాధ్యక్షులు మహంతి శంకరరావు, నాయకులు పసులేటు గోపి, పిన్నింటి శ్రీనివాసరావు, దంతులూరి సూర్యనారాయణరాజు, ఇజ్జురోతు ఈశ్వరరావు పాల్గొన్నారు.


వెళ్దూరు సర్పంచ్ సత్యవతి తదితరులను కండువా వేసి ఆహ్వానిస్తున్న బంగార్రాజు, నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న యశస్విని

వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి: పాలవలస యశస్విని

మెంటాడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఏర్పడేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని జనసేన నాయకురాలు పాలవలస యశస్విని తెలిపారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మంగళవారం మెంటాడలో పార్టీ మండలాధ్య క్షుడు సబ్బవరపు రాజశే ఖర్ అధ్యక్షతన పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన జనసేన జనగర్జన కార్యక్రమంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందన్నారు. సీఎం జగన్ రెడ్డిలో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. త్వరలోనే రెండుపార్టీల అధినేతలు అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారని, ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేస్తారని తెలిపారు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మించడమే రెండు పార్టీల లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రిషివర్ధన్, ఎస్.రాజశేఖర్, ఎం .సురేష్,అడారి మోహన, జీటీనాయుడు, విజయ చౌదరి, బాబు పాలూరి, జగన్నాథం, శివ, తౌడు, టీడీపీ నాయకులు రవిశంకర్,రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్‌తో చర్చించి సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

నెల్లిమర్ల: ఇప్పటికైనా మిమ్స్ యాజమాన్యం యూనియన్‌తో చర్చించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్‌చేశారు. మంగళవారానికి మిమ్స్ ఉద్యోగులు పోరాటం ఆరోరోజుకు చేరింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ మిమ్స్ పోరాటం న్యాయమైందని, అందుకే రోజురోజుకు పోరాటానికి మద్దతు పెరుగుతోందని తెలిపారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి మిమ్స్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేయగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారని చెప్పారు. బుధవారం విజయనగరం కార్మికశాఖ కార్యాలయంలో డీసీఎల్ చర్చలు ఏర్పాటు చేశారని తెలిపారు. చర్చలు విఫలమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేయడానికి సిద్ధమవుతామని చెప్పారు.

చట్టాలపై అవగాహన అవసరం

- శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ గరికిన దుర్గయ్య



మాట్లాడుతున్న దుర్గయ్య

గంట్యాడ: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రజాప యోగ సేవల శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ గరికిన దుర్గయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కొటారుబిల్లిలో న్యాయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు పరిష్కారం కోసం లోక్‌అదాలత్‌ను ఆశ్రయించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గుషిణిలో ఆరోగ్య సురక్ష

నెల్లిమర్ల: గుషిణి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం ఎంపీడీవో రామారావు పరిశీలించారు. ఈవోపీఆర్డీ కె.సింహాద్రి, సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయిరాం పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న కల్లు గీత కార్మికులు

గజపతినగరం: కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు పురం అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపుల వల్ల కల్లు గీత కార్మికులకు జీవనోపాధి కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బార్ అండ్ రెస్టారెంట్‌లు, మద్యం షాపుల్లో అర్హత ఉన్న కల్లు గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ వి.రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, సూరప్పుడు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ఇంగ్లీష్ మీడియం, ఇంటర్ సీఈసీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.ఉషారాణి ఒక ప్రకటన లో కోరారు. ఐదోతరగతి ప్రవేశానికి గుర్తింపు పొందిన పాఠశాలలో 3,4 తరగతులు చదివి వార్షిక ఆదాయం లక్ష రూపాయలకు మించ కుండా ఉండాలని తెలిపారు. ఇంటర్ సీఈసీలో 80 సీట్లు ఇంగ్లీష్ మీడియంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ప్రవేశానికి ఈనెల 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష వచ్చే నెల 10న జరుగుతుందని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి

- డిప్యూటీ డీఈవో వాసుదేవరావు


మాట్లాడుతున్న వాసుదేవరావు

నెల్లిమర్ల: విద్యార్థులకు ప్రణాళికా బద్ధమైన అభ్యసన, బోధనలు ఉండాలని డిప్యూటీ డీఈవో కె.వాసుదేవరావు, డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతిరావునాయుడు సూచించారు. మంగళవారం నెల్లిమర్ల కేజీబీవీలో జిల్లా మోనటరింగ్ బృందం సంద ర్శించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు, తిరుపతినాయుడు 6,7,8,10 తరగతి విద్యార్థినుల అభ్యసన, బోధన తదితర అంశాలపై పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షించారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థిలను గుర్తించి ఉపాధ్యాయులు మెరుగైన బోధనలు అందించి ముందుకు తీసుకుని రావాలన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, టైం టేబుల్ ప్రకారం ప్రాజెక్టు వర్కులు పూర్తిచేసే విధంగా కృషి జరగాలని కోరారు. పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమ, డైట్ లెక్చరర్లు శ్రీనివాస్, సూర్యారావు, రామకృష్ణ, బృంద సభ్యులు ప్రవీణ్‌కుమార్, దామోదరనాయుడు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణలో అలసత్వం వద్దు

గరుగుబిల్లి: సచివాలయాల పరిధిలోని సిబ్బంది రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించరాదని ఎంపీడీవో పైల సూర్యనారాయణ అన్నారు. మంగళ వారం ఉల్లిభద్ర సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంసూచించిన మేరకు జాబ్‌చార్ట్‌ను విధిగా నిర్వహించాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలందించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించా రు. పరిశీలనలో కార్యదర్శి కోటేశ్వరరావు, వీఆర్వో ధనుంజయరావు ఉన్నారు.

పంటలకు రుణ సౌకర్యం పెంపు

పార్వతీపురం రూరల్: పంట రుణ సౌకర్యం పెంచడానికి జిల్లా కన్సల్టేటివ్ కమిటీ (బ్యాంకర్ల సమావేశం) తీర్మానించింది. జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో నిశాంత్‌కుమార్ అధ్యక్షతన మంగళ వారం జరిగింది.ఈ సందర్భంగా వరి పంటకు రుణ సౌకర్యం గత ఏడాది రూ.38 వేలు నుంచి రూ.42 వేలు ఉండగా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.42 వేల నుంచి రూ.45 వరకు అందించడానికి నిర్ణయించారు. చెరకు, అరటి, జొన్న, పత్తి పంటలకు కూడా రుణ సౌకర్యం పెంచారు. సమావేశంలో ఆర్‌బీఐ లీడ్ జిల్లా అధికారి పి.నాగ ప్రవీణ, నాబార్డు జిల్లా మేనేజర్ నాగార్జున, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి, డిసిసి జనరల్ మేనేజర్ వాసు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: కుష్టువ్యాధి నిర్మూలనపై తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపరిధిలో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సిబ్బం ది ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ కుష్టువ్యాధిపై ప్రతిఒక్కరూ జా గ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఈ వ్యాధి లక్షణాలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహి స్తున్నారని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీచేశారు.కార్యక్రమంలో తాడికొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది,ఆశావర్కర్లు,ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.

నియంతల పాలన నుంచి రక్షించుకోవాలి

బెలగాం: నియంత పాలన నుంచి దేశం, రాష్ట్రాన్ని రక్షించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు పిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధం అంటూ సభలు నిర్వహిస్తున్నారని, అసలు దేనికి సిద్ధమని ప్రశ్నిం చారు. ల్యాండ్, శాండ్, మైన్, వైన్ నొక్కేయడానికా.., దళిత, గిరిజన హక్కులు కాలరాయడానికి సిద్ధమా అని అన్నారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను నట్టేట ముంచడానికి సిద్ధమా, రైతులను ఆదుకోకుండా ముంచేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ నియంతపాలనకు వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలన్నారు.



